క్లుప్తంగా

ఏపీ సీడ్స్ సర్టిఫికేషన్ ఏజెన్సీ సభ్యుడిగా జనార్థనరెడ్డి



నియామకపు ఉత్తర్వులను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ సర్టిఫికేషన్ ఏజెన్సీ సభ్యుడిగా అనపర్తికి చెందిన వివేకానంద సీడ్స్ అధినేత సత్తి జనార్థనరెడ్డి నియమితులయ్యారు. దీనికి సంబంధించి జీవో నంబర్ 444, ఏపీ అగ్రికల్చర్ అండ్ కో–ఆపరేషన్ డిపార్ట్‌మెంట్ మంజూరు చేసిన నియామకపు ఉత్తర్వులను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మంగళవారం జనార్థనరెడ్డికి అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎంఈఓ–2గా మధుసూదనరావు



మధుసూదనరావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంఈఓ శ్రీనివాసరావు

రంగంపేట: మండల విద్యాశాఖాధికారి–2గా పి. మధుసూదనరావు నియమితులయ్యారు. ఈయన ఇప్పటి వరకు పి. గన్నవరం మండలం నరేంద్రపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా పని చేస్తూ ఇటీవల నిర్వహించిన బదిలీల్లో పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. మంగళవారం ఆయన స్థానిక ఎంఈఓ కె. శ్రీనివాసరావును కలసి ఎంఈఓ–2గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మర్రిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. గ్రామ సర్పంచ్ వేము మాధవి, హెచ్‌ఎం రవికుమార్‌లతో పాఠశాల ప్రగతిపై చర్చించారు.

ప్రత్యేక అలంకరణలో కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి



బిక్కవోలు: మండలంలోని బిక్కవోలులో కొలువైన ఉన్న కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక అలంకరణ చేశారు. మంగళవారం స్వామివారికి 187 అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామివారికి అలంకరణ చేశారు. వచ్చిన భక్తులకు దేవదాయశాఖ ఆధ్వర్యంలో అన్న సమారాధన నిర్వహించారు.

కేవీపీఎస్ నాయకుడి పర్యటన

గోకవరం: తిరుమలాయపాలెం గ్రామంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు జువ్వల రాంబాబు మంగళవారం పర్యటించారు. ఇటీవల గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు తదనంతరం విగ్రహం తొలగింపులో తలెత్తిన ఉద్రిక్తతలో గాయపడిన బోయిడి మహాలక్ష్మి, సబ్బులక్ష్మి తదితరులను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఘటనపై ప్రభుత్వం వెంటనే స్పందించి దళితులకు రక్షణ కల్పించడమే కాకుండా అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించిన స్థానంలో తిరిగి ప్రతిష్ఠించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రసన్నకృష్ణ, జయరాజ్ శ్రీనివాస్, ఎడ్ల సుధాకర్, జి.మణికంఠ, సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

బీమా సొమ్ము అందజేత



వైఎస్సార్ బీమా సొమ్ము అందజేస్తున్న వీరబాబు

గోకవరం: గ్రామంలో సచివాలయం–2 పరిధిలో నివాసం ఉంటున్న పొట్నూరి మురారి ఇటీవల మృతి చెందగా ఆయన భార్య కాంతమ్మకు మంగళవారం వైఎస్సార్ బీమా పథకంలో తక్షణ సహాయంగా రూ.10 వేలు వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు అందజేశారు. పథకంలో మిగిలిన రూ.90 వేలు నగదు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని తెలిపారు. పార్టీ నాయకుడు తోలేటి రాంప్రసాద్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

నేడు ఇంటర్వ్యూలు

రాజానగరం: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని రాజానగరం, కడియం, రాజమహేంద్రవరం రూరల్ మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు బుధవారం ఇంటర్వ్యూలు జరగనున్నాయి. రాజమహేంద్రవరం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఉదయం 9 నుంచి ప్రారంభమయ్యే ఈ ఇంటర్వ్యూలకు అభ్యర్థులు అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని ప్రాజెక్టు సీడీపీఓ టి.నాగమణి తెలిపారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- దోసకాయలపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం



దోసకాయలపల్లిలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: పేదల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండ మండలం దోసకాయలపల్లిలో జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రాజా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో అభివృద్ధి కోసం రూ.7.12 కోట్లు వెచ్చించామని, జల్‌జీవన్ మిషన్‌కు రూ.51 లక్షలు, పాఠశాలల అభివృద్ధికి నాడు–నేడు పథకం ద్వారా రూ.2.80 లక్షలు నిధులు కేటాయించినట్టు తెలిపారు. రూ.61 లక్షలతో సీసీ డ్రైనేజీలు, రూ.73 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించామన్నారు. సంక్షేమ పథకాల పేరిట 6,478 మందికి రూ.14,45,16,312 లు అందజేసినట్టు తెలిపారు. గ్రామంలో శెట్టిబలిజ సామాజిక భవనాన్ని అర్బన్ డెవలప్‌మెంట్ నిధులతో పూర్తిచేయడం జరిగిందన్నారు. ఎస్సీ, సగర సామాజిక వర్గాల భవన నిర్మాణాలు చేయాల్సి ఉందన్నారు. టీడీపీకి పట్టున్న ఈ గ్రామంలో గత ప్రభుత్వంలో కేవలం రూ.71 లక్షలు మాత్రమే నిధులు కేటాయించిందన్నారు.

ఇళ్ల స్థలాల పంపిణీపై టీడీపీ కేసులు

ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ గ్రామంలో 284 మంది పేదలను గుర్తించి వారికి ఇళ్ల స్థలాలను కేటాయిస్తే, ఓర్వలేని దృష్టితో టీడీపీ నాయకులు కోర్టులో కేసులు వేశారన్నారు. కోర్టు వివాదాల కారణంగా పేదలు, బడుగులకు ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ జరగలేదన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమం రాత్రి 8 వరకూ జరిగింది. ఈ సందర్భంగా 185 ఇళ్లను ఎమ్మెల్యే రాజా సందర్శించారు. తొలుత దేవి సెంటర్‌లోని దుర్గమ్మను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు రైతులు పుష్కర కాలువ నీటిని ఖరీఫ్ సాగుకు విడుదల చేయాలని కోరారు. దానికి ఆయన అంగీకారాన్ని తెలిపారు. కాపు సామాజిక వర్గం హక్కుల కోసం ఉద్యమించిన నాయకుడు ముద్రగడ పద్మనాభంపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ విమర్శలు చేయడం సిగ్గుచేటని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, వ్యవసాయ సలహామండలి చైర్మన్ క్రొవ్విడి సర్రాజు, ఎంపీపీ ఉల్లి సూర్యకుమారి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు అడపా కనకరాజు, గణేశుల పోసి, సర్పంచుల సమాఖ్య మండలాధ్యక్షుడు కడియాల పాపారావు, స్థానిక ఎంపీటీసీ బేదంపూడి పాప, పార్టీ నాయకులు కంటే వినయ్‌తేజ, కొండపల్లి దుర్గారావు, చాటపర్తి దుర్గారావు, అడపా కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓవర్‌హెడ్ ట్యాంకు ప్రారంభం

మధురపూడి: కోరుకొండ మండలం మధురపూడిలో జల్‌జీవన్ మిషన్ పథకంలో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకును ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా మంగళవారం ప్రారంభించారు. విమానాశ్రయం రహదారి నుంచి గ్రామానికి వెళ్లే రోడ్డులో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు, లైటింగ్‌కు ప్రారంభోత్సవం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గణేశుల పోసి, పార్టీ నాయకులు చాటపర్తి దుర్గారావు, బత్తిన త్రిమూర్తులు, ఇండుమెల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి సీఎం జగన్ ప్రాధాన్యం



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంపీపీ జ్యోత్స్న తదితరులు

సీతానగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యాభివృద్ధికి పెద్దపీట వేశారని ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న అన్నారు. వెదుళ్లపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో మంగళవారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ జ్యోత్స్న, వైస్ ఎంపీపీ –2 సత్యం మదన్ బాబు, పీఏసీఎస్ చైర్ పర్సన్ తన్నీరు త్రిమూర్తులు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ మెంబర్ ఈతకొట్టు పోశి చేతుల మీదుగా విద్యార్థులు ముగ్గుళ్లకు చెందిన గరికిపాటి శిరీష, గరికిపాటి నాగ ప్రమోద్‌సాయి, ఇనుగంటివారిపేటకు చెందిన సత్యం బేబీప్రియ చందులకు ప్రభుత్వం అందించిన నగదు, సర్టిఫికెట్లు, ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సీతామహాలక్ష్మి, ఉపాధ్యాయులు మోహన్ కృష్ణ, శ్రీనివాస్, సుధాకర్ పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యానికి భరోసా

ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి



పౌష్టికాహార కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: చిన్నారుల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం భరోసాగా నిలుస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కుతుకులూరులో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామంలో రక్తహీనతతో బాధపడుతున్న చిన్నారులకు పౌష్టికాహారం అందించేందుకు దాతల సౌజన్యంతో ఏర్పాటు చేసిన బంగారు కొండ కిట్లు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌష్టికాహారం అందక చిన్నారులు ఎనీమియా బారినపడే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. గ్రామ సర్పంచ్ గొల్లు హేమతులసి సురేష్, వైస్ ఎంపీపీ పులగం బుల్లిరెడ్డి సమకూర్చిన పౌష్టికాహార సామాన్లు ఉన్న కిట్లు చిన్నారులకు అందజేశారు.

సమాజాభివృద్ధిలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలి

సమాజాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మండలంలోని కుతుకులూరులో జరిగిన కార్యక్రమలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని దాతల సహకారంతో సమకూర్చి సప్‌లై సామాన్లను సంక్షేమ సంఘం వారికి అందజేశారు.

ఎంపీటీసీ సభ్యుడు సత్తి దొరయ్యరెడ్డి, ఎంపీడీఓ కె.హిమమహేశ్వరి, పార్టీ రాజమహేంద్రవరం పార్లమెంటరీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు నల్లమిల్లి కాంతమ్మ, జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు కర్రి త్రినాథరెడ్డి, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ పడాల హరిసాయికృష్ణారెడ్డి, వ్యవసాయ సలహామండలి చైర్మన్ పడాల శ్రీనివాసరెడ్డి, పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ నల్లమిల్లి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్‌కు ముగ్గురు విద్యార్థుల ఎంపిక



రంగంపేట మండలం నుంచి ఎంపికైన విద్యార్థులు

రంగంపేట: వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్లో ప్రవేశాలకు విద్యార్థుల ఎంపిక స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగింది. మండల విద్యాశాఖాధికారి కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సెలెక్షన్స్‌లో చంద్రేడు పాఠశాల నుంచి ఇద్దరు బాలురు, సింగంపల్లి పాఠశాల నుంచి బాలిక ఎంపికయ్యారని ఎంఈఓ శ్రీనివాసరావు తెలిపారు. వీరు కడపలో వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూలులో 4వ తరగతిలో ప్రవేశాలకు అర్హత సాధించారని తెలిపారు. ఈ ఎంపికకు న్యాయ నిర్ణేతలుగా ఈలకొలను, సింగంపల్లి, చంద్రేడు గ్రామాల్లో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల పీడీలు వై.వెంకటేశ్వర్లు, ఎం.మేరీ హవీల, బాపిరాజు, వీరంపాలెం, రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల పీఈటీలు ఎండీ రియాజ్, సీహెచ్ బూరిబాబు వ్యవహరించారు.

పశుబీమా పథకాన్ని వినియోగించుకోండి



వెదురుపాకలో గొర్రెలకు ట్యాగ్‌లు వేస్తున్న డీడీ వెంకటేశ్వర్లు

గోకవరం: వైఎస్సార్ పశుబీమా పథకాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాజమహేంద్రవరం పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం.వెంకటేశ్వర్లు అన్నారు. వెదురుపాక గ్రామంలో మంగళవారం వైఎస్సార్ పశు బీమా పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వెంకటేశ్వర్లు బీమా గురించి పాడి రైతులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం పాడి రైతుల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం గొర్రెలకు బీమా ట్యాగ్‌లు వేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పి.ప్రభావతి, గోకవరం, రంపయర్రంపాలెం వెటర్నరీ అసిస్టెంట్ కె.అనిత, పి.కృష్ణవేణి, పాడి రైతులు కొరిపల్లి అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడిని చిత్తు చేసే ఆయుధం



కొమరిపాలెంలో యోగా సాధన చేస్తున్న గ్రామస్తులు

నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం

బిక్కవోలు: యోగా ఆనందాన్నిస్తుంది. ఒత్తిడిని జయించేలా చేస్తుంది. మానసిక ప్రశాంతతకు దోహదపడుతుంది. దీర్ఘకాలిక రుగ్మతలను నయం చేస్తుంది. విజయానికి బాటలు వేస్తుంది. మన సంస్కృతి, సంప్రదాయాల సంపదగా యోగా విరాజిల్లుతోంది. నేటి ఉరుకుల పరుగుల జీవితంతో ఉపశమనం కలిగించే ఆయుధంగా యోగా మారిందంటే దాని శక్తి ఇట్టే అర్థమవుతుంది. మధుమేహం, రక్తపోటు, గుండె జబ్బులు, ఆస్తమా, గ్యాస్ట్రిక్, థైరాయిడ్, కీళ్ల నొప్పులు సమస్యలన్నింటి నుంచి బయట పడడానికి యోగాయే మార్గమని యోగా శిక్షకులు చెబుతున్నారు. బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

12 ఏళ్లుగా నేర్పుతున్నాం



25 ఏళ్ళ క్రితం యోగా నేర్చుకున్నాను. రూ.25 లక్షలతో యోగా కేంద్రాన్ని ఏర్పాటు చేసి 12 ఏళ్లుగా యోగా నేర్పుతున్నాం. ప్రతిఒక్కరికి యోగా నేర్పించాలనే తపనతో గ్రామాల వారీగా గురువులను ఏర్పాటుచేసి యోగాను విస్తరింపజేసేందుకు కృషి చేస్తున్నాం.

– తాడి అరవిందం, యోగా గురువు, కొమరిపాలెం

మహిళలంతా యోగా చేయాలి



యోగా సాధన చాలా సులువైన ప్రక్రియ. రోజూ ఉదయం, సాయంత్రం కొంత సమయం యోగాకు కేటాయిస్తే ఆరోగ్యవంతమైన జీవితం లభిస్తుంది. జీవితంలో ఎదురయ్యే ఒత్తిళ్లను అధిగమించేందుకు మహిళలంతా యోగా సాధన చేయాలి.

– కర్రి రాణి, మహిళా యోగా గురువు, కొమరిపాలెం

చినుకులతో ఉపశమనం

రాజానగరం: విపరీతమైన ఎండలతో అల్లాడిపోతున్న ప్రజలకు మంగళవారం సాయంత్రం కురిసిన కొద్దిపాటి చినుకులు ఉపశమనాన్ని కలిగించాయి. వాతావరణం కొద్దిగా చల్లబడడంతో సంబర పడ్డారు. ఈ వేసవిలో ముఖ్యంగా రోహిణీ కార్తె మొదలుకుని మృగశిరకార్తెలో కూడా ఎండలు దంచి కొట్టడంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. నైరుతి రుతుపవనాల కోసం రైతుల కంటే ఎంతో ఆశగా సామాన్య ప్రజానీకం కూడా ఎదురుచూస్తోందంటే వేసవి ప్రతాపం ఎంత తీవ్రంగా ఉందో గ్రహించవచ్చు. ఈ తరుణంలో మంగళవారం కురిసిన చిన్నపాటి వర్షం సంతోషం కలిగించింది. కాగా.. ఈదురు గాలులకు జాతీయ రహదారితో పాటు పలు ప్రాంతాలలో చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

కౌలురైతు కార్డులతో ప్రయోజనం

అనపర్తి: ప్రభుత్వం మంజూరు చేస్తున్న కౌలు రైతు గుర్తింపు కార్డులతో అనేక ప్రయోజనాలు చేకూరుతాయని మండల వ్యవసాయాధికారి బి.సురేష్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని పులుగుర్తలో వీఆర్వో వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కౌలురైతు గుర్తింపు కార్డులు(సీసీఆర్‌సీ)పై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఏఓ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న దృష్ట్యా 2023–24 సంవత్సరానికి అర్హులైన ప్రతీ ఒక్కరికీ సీసీఆర్‌సీ కార్డుల మంజూరుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. 2019 చట్టం ప్రకారం భూమిని కౌలుకు తీసుకున్న రైతుకు కేవలం 11 నెలల కాలపరిమితి మాత్రమే పంటపై హక్కు ఉంటుందని, భూమిపై ఏ మాత్రం హక్కు ఉండదని చెప్పారు. ఈ విషయంలో భూ యజమానులు భయపడాల్సిన అవసరం లేదని తెలిపారు. గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ భామిరెడ్డి, సొసైటీ చైర్మన్ సూరారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ వెంకటరెడ్డి, ధర్మారెడ్డి భూ యజమానులు, కౌలు రైతులు, వలంటీర్లు, వీఏఏలు హాజరయ్యారు.

నేడు ఫిజికల్ ఫిట్‌నెస్ పరీక్షలు

అనపర్తి: కడపలో గల డాక్టర్ వైఎస్సార్ స్టేట్ స్పోర్ట్స్ స్కూల్‌లో నాలుగు, ఐదు తరగతుల్లో ప్రవేశానికి విద్యార్థుల ఎంపికకు సంబంధించి బుధవారం ఫిజికల్ ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ కె.స్వామినాయక్ తెలిపారు. మండల స్థాయిలో నిర్వహించే ఈ పరీక్షలు స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతాయని తెలిపారు. ఎంఈఓ అధ్యక్షతన జరిగే ఈ ఎంపికలకు సంబంధించిన పరీక్షలు వ్యాయామ ఉపాధ్యాయులు నిర్వహిస్తారని, దీనికి ఎంపికై న విద్యార్థులకు జిల్లా స్థాయిలో కూడా ఎంపికలు నిర్వహిస్తారని చెప్పారు. జిల్లా స్థాయిలో కూడా ఎంపికైన విద్యార్థులకు స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశానికి అర్హులని తెలిపారు. స్పోర్ట్స్ స్కూల్‌లో నాలుగు, ఐదు తరగతుల్లో చేరేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ ఎంపిక పరీక్షలకు హాజరు కావాలని ఎంఈఓ సూచించారు.

మరో రెండు రోజులు నీటి సరఫరా బంద్

రాజానగరం: మండలంలో పైపులైను ద్వారా జరుగుతున్న గోదావరి జలాల పంపిణీకి బ్రేక్ పడింది. విద్యుత్ శాఖ స్తంభాల ఏర్పాటు కోసం భూపాలపట్నంలో రోడ్డు పక్కన గోతులు త్రవ్వే క్రమంలో గోదావరి పైపులైన్‌కి చిల్లు పడటంతో ఈ సమస్య ఎదురైందని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించి, నీటి సరఫరాను పునరుద్ధరించేందుకు రెండు రోజులు పడుతుందన్నారు. అప్పటివరకూ శ్రీకృష్ణపట్నం, చక్రద్వారబంధం, వెలుగుబంద గ్రామాలకు గోదావరి జలాల పంపిణీ ఉండదన్నారు. శ్రీకృష్ణపట్నంలో ఏర్పడిన పైపులైను రిపేరు కారణంగా ఇప్పటికే రెండు రోజులు నీటి సరఫరా ఆగిపోయింది, దీనిని పరిష్కరించామనుకుంటున్న సమయంలో మరోమారు సమస్య ఎదురైందన్నారు.

రోడ్డు ప్రమాదంపై కేసు

సీతానగరం: చినకొండేపూడికి చెందిన నేలపాటి వాడయ్యను మోటారు సైకిల్‌తో ఢీకొట్టిన 70 ఏళ్ల లక్కిశెట్టి సోమరాజుపై కేసు నమోదు చేశామని మంగళవారం ఏఎస్సై సమర్పణరావు తెలిపారు. గతనెల 23న పెద్దకొండేపూడి రోడ్డు కోళ్లఫాం వద్ద వాడయ్య సైకిల్‌పై వస్తుండగా సోమరాజు మోటారు సైకిల్‌తో ఢీకొట్టాడు. ఈ ఘటనలో వాడయ్యకు గాయాలయ్యాయి. దీంతో చికిత్స కోసం కొంత నగదు ఇస్తానని పెద్దల సమక్షంలో సోమరాజు హామీ ఇచ్చాడు. అయితే నగదు ఇవ్వకపోవడంతో బాధితుడి భార్య చినమంగ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రజలకు అందుబాటులో రిజిస్ట్రేషన్లు

- కలెక్టర్ మాధవీలత
- పుణ్యక్షేత్రం సచివాలయం సందర్శన



రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ మాధవీలత

రాజానగరం: రెవెన్యూ శాఖలో మరింత పారదర్శకతను తీసుకురావడంలో భాగంగా గ్రామ/వార్డు సచివాలయాలలో రిజిస్ట్రేషన్ సదుపాయాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామని కలెక్టర్ కె.మాధవీలత అన్నారు. మండలంలోని పుణ్యక్షేత్రం గ్రామ సచివాలయాన్ని మంగళవారం సాయంత్రం సందర్శించిన ఆమె అక్కడ జరుగుతున్న రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పరిశీలించారు. రెవెన్యూ సర్వీసులపై ప్రజలలో ఉన్న అసంతృప్తిని తొలగించడంతో పాటు వేగవంతమైన సేవలు అందించే దిశగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందన్నారు. అందులో భాగంగానే రిజిస్ట్రేషన్ల ప్రక్రియ చేపట్టిందన్నారు. జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ మాట్లాడుతూ ఇకపై గ్రామ రెవెన్యూ అధికారి జాయింట్ సబ్ రిజిస్ట్రార్ హోదాలో రిజిస్ట్రేషన్లు నిర్వహిస్తారన్నారు. దస్తావేజులతోపాటు అన్ని రకాల రిజిస్ట్రేషన్లు, ఈసీలు, మార్కెట్ విలువలు, హిందూ, ప్రత్యేక వివాహాల రిజిస్ట్రేషన్ వంటి పౌర సేవలు పొందవచ్చన్నారు. ఇదే సమయంలో కలెక్టర్ సమక్షంలో కె.భరత్‌జైన్ తన ఇంటి స్థలాన్ని విక్రయ్‌సింఘ్ రాథోడ్ అనే వ్యక్తి పేరున రిజిస్ట్రేషన్ చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెద వెంకన్న, గ్రామ సర్పంచ్ మరుకుర్తి వెంకటేశ్వరరావు, ఆర్డీఓ చైత్రవర్షిణి, తహసీల్దార్ పవన్ కుమార్, సచివాలయ కార్యదర్శి గిరీష్ కుమార్, వీఆర్వో వై.బాపిరాజు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో ఎల్‌సీడీసీ ప్రోగ్రాంపై శిక్షణ



రంగంపేట పీహెచ్‌సీ శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ లావణ్య

రంగంపేట: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం లెప్రసీ కేసెస్ డిటెక్షన్ క్యాంపెయిన్ (ఎల్‌సీడీసీ) ప్రోగ్రాంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డి.లావణ్య మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ఆశా కార్యకర్తలు, వలంటీర్లు తమ పరిధిలోని ప్రతీ ఇంటినీ సర్వే చేసి చర్మ వ్యాధులు ఉన్న వారిని గుర్తించాలని, అవసరమైన వారిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలని సూచించారు. అటువంటి వారికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు నిర్వహించి తగిన వైద్య సేవలు అందించి, మందులు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమం ఈ నెల 26వ తేదీ నుంచి జూలై 16వ తేదీ లోపు నిర్వహించాలని శిక్షణలో తెలియజేశారు. డాక్టర్ ఎ.అనూష, పీహెచ్‌సీ సిబ్బంది, ఆశ కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

సేవలు అభినందనీయం



పైన గ్రామంలో వృద్ధురాలికి దుప్పటి అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: పైన గ్రామంలోని హెల్పింగ్ హార్ట్స్ డిజెబుల్ సొసైటీ చేస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. పైన గ్రామంలోని ఈ సొసైటీ నిర్వహిస్తున్న బ్లైండ్ స్కూల్లో మంగళవారం వృద్ధులకు, అనాథ పిల్లలకు, పేదలకు దుప్పట్లు, భోజనం ప్లేట్లను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. వీటిని గంగ్రేడు ఎంపీటీసీ సభ్యుడు గుత్తుల శివకుమార్ ఏర్పాటు చేశారు. ఎంపీపీ కేతా తులసి, గ్రామ సర్పంచ్ సుందరపల్లి ప్రమీల, ఎంపీటీసీ సభ్యుడు సుందరపల్లి సుధాకర్‌బాబు, సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు కోసూరి వాసు, మాజీ సర్పంచ్ కట్టా రమణ, వైఎస్సార్ సీపీ నాయకులు నాగుమళ్ల వీరభద్రరావు, దంగేటి దుర్గారావు పాల్గొన్నారు.

విద్యా విధానంలో విప్లవాత్మక మార్పులు



మర్రిపూడి హైస్కూల్లో విద్యార్థులకు బహుమతులు అందించిన ప్రజా ప్రతినిధులు, నాయకులు

రంగంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యా విధానంలో పలు విప్లవాత్మక మార్పులు ప్రవేశపెట్టిందని ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి అన్నారు. మంగళవారం మర్రిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. పాఠశాల స్థాయిలో ఇటీవల 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో మొదటి మూడు స్థానాలు పొందిన మేడిది వేణు, నెల్లి అరుణ, చెల్లిబోయిన సమీరాలకు ప్రభుత్వం ప్రకటించిన నగదు, మెడల్స్‌తో పాటు ప్రశంసా పత్రాలను ఆమె అందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, సర్పంచ్ వేము మాధవి, ఉప సర్పంచ్ మేడిది చక్రం, పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు పుట్టా సోమన్నచౌదరి, వైఎస్సార్ సీపీ కన్వీనర్ వేము చిరంజీవి, హెచ్‌ఎం రవికుమార్ పాల్గొన్నారు.

యోగాపై పోటీలు

రాజానగరం: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదికవి నన్నయ యూనివర్సిటీలో బీఈడీ కళాశాల విద్యార్థులకు ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం వక్తృత్వ పోటీలు నిర్వహించారు. యోగా సాధన చేయడం ద్వారా విద్యార్థులకు బుద్ధివికాసం చెంది, పఠనా శక్తి పెరుగుతుందని, తద్వారా చదువులో బాగా రాణిస్తారని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుబ్బారావు అన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ డాక్టర్ ఎం.గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందాలి

రాజానగరం: రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందాలనే లక్ష్యంతోనే 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని తీసుకువచ్చారని ఎంపీడీఓ బి. రామారావు అన్నారు. మండలంలోని గ్రామ సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు, వీఆర్వోలు, గ్రామ వలంటీర్లతో స్థానిక జీఎస్ఎల్ ఆడిటోరియంలో 'జగనన్న సురక్ష' కార్యక్రమం పై మంగళవారం అవగాహన కల్పించారు. అర్హులై ఉండి, ఏకారణం చేతనైనా సంక్షేమ పథకాలు అందని వారికి ఈ కార్యక్రమంలో న్యాయం చేస్తారన్నారు. ఇందుకోసం జూలై 4 నుంచి 28 వరకు ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నామన్నారు. ఇంటింటికీ వెళ్లి, సంక్షేమ పథకాల గురించి వివరించి, అర్హులైతే వెంటనే వారిచే దరఖాస్తు చేయించి, వారికి న్యాయం చేయాలని సూచించారు. వీటితో పాటు గ్రామ సచివాలయాల ద్వారా అందిస్తున్న 540 ఆన్‌లైన్ సేవలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెద వెంకన్న, వైఎస్సార్ సీపీ మండల మాజీ కన్వీనర్ మందారపు వీర్రాజు, సర్పంచ్ కుందేటి ప్రసాద్, మండల ప్రత్యేకాధికారి పి.వీణాదేవి, ఐసీడీఎస్ సీడీపీఓ టి.నాగమణి పాల్గొన్నారు.